క్లుప్తంగా

ఉత్సవాల ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలో మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 25వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలని తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డిలు తెలిపారు. పొలతల క్షేత్రంలోని పర్యాటక భవనంలో శుక్రవారం ఉత్సవాల ఏర్పాట్లపై మండల స్థాయి అధికారులకు సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా తాగునీటికి ఇబ్బందులు రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా గుంతలు పూర్చివేయాలన్నారు. అత్యవసర సేవలకు 108 అంబులెన్స్ వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణానాయక్, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, ట్రాన్స్‌కో, ఆర్టీసీ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

లంచం ఇస్తేనే కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇస్తారు

లింగాల : ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో లంచాలు ఇవ్వందే సామాన్య ప్రజలకు ఏ ఒక్క పని జరగడంలేదు. రెవెన్యూ కార్యాలయంలో కుల, ఆదాయ, జనన, మరణ ధృవీకరణ పత్రాలు అందాలంటే రూ.100 నుంచి రూ.200 సమర్పించుకోవాల్సి వస్తోందని సామాన్య ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా రైతుల భూములకు సంబంధించి ఇ-పాసు పుస్తకాలు పొందాలంటే వాటిని మ్యుటేషన్ చేసేందుకు, ఆన్‌లైన్‌లో పంపేందుకు సుమారు రూ.2వేల నుంచి రూ.5వేలు తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. దీనిపై తహసీల్దార్ ఈశ్వరయ్యను వివరణ కోరగా అలాంటిదేమి లేదన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

పెండ్లిమర్రి : ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయం చేసేలా వారిని ప్రోత్సహించాలని రైతు సాధికార సంస్థ సీతఈఓ రామారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పగడాలపల్లె గ్రామ పొలాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతు గంగిరెడ్డి సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చనన్నారు. ఏటీఎం మోడల్ ద్వారా నిరంతర ఆదాయం వస్తోందన్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, టీం లీడర్ సందీప్, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల(స్వయం ప్రతిపత్తి) స్కౌట్ విద్యార్థులు ఇటీవల తమిళనాడులోని తిరుచిరాపల్లిలో వారం రోజుల పాటు నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరి వేడుకల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుధాకరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు జాతీయ జంబోరి వేడుకల్లో ప్రతిభ చూపి మన రాష్ట్రానికి మరియు కడప జిల్లాకు పేరు తెచ్చిన విద్యార్థులను అభినందించారు. ఈ వేడుకల్లో కళాశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫిజికల్ డైరెక్టర్ ఏ.రాజేష్ పాల్గొని ప్రతిభ కనపరచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి




మాట్లాడుతున్న ఆర్జేడీ రవి

చక్రాయపేట : ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అదిరోహిస్తారని ఇంటర్ మీడియట్ ఆర్జేడీ రవి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రంతుబషా ఆధ్వర్యంలో కళాశాల దినోత్సవ వేడుకకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో ఇప్పటి వరకు 1300 మంది విద్యను అభ్యసించగా వారిలో 800 మంది ప్రభుత్వ ఉద్యోగులు అయ్యారన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గండి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, వేముల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బరామయ్య, చక్రాయపేట, నాగలగుట్టపల్లె, మహదేవపల్లె, చిలేకాంపల్లె జెడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్

ఎర్రగుంట్ల : మండల వ్యాప్తంగా రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు సకాలంలో రేషన్ అందక పరేషన్ పడుతున్నారు. ఎప్పుడు చౌక దుకాణాలు తెరుస్తారో తెలియని పరిస్థితిలో ఉన్నామని లబ్ధిదారులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ పంపిణీ అస్తవ్యస్థంగా తయారైందని లబ్ధిదారులు వాపోతున్నారు.

మండల పరిధిలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మున్సిపాలిటీతో కలుపుకుని 37 ప్రభుత్వ చౌక దుకాణాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 20,785 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా బియ్యం, చక్కెర, కందిబెడలు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తోంది. అయితే ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీకి వరకు పంపిణీ చేయాల్సి ఉంది. ప్రస్తుత డీలర్లు ఐదు రోజులు పంపిణీ చేసి ఇక సరుకులు లేవంటు చౌక దుకాణాలు మూసివేస్తున్నారని పలువురు రేషన్‌కార్డుల లబ్ధిదారులు వాపోతున్నారు. కార్డులకు ఇవ్వాల్సిన బియ్యంలో ఐదు కిలోలు తక్కువగా ఇస్తున్నారని వాపోతున్నారు. ఇది ఏమిటన అడిగితే మాకే తక్కువగా ఇస్తున్నారన్నారు. బియ్యం తక్కువ వస్తున్నాయంటూ నగదును అందిస్తున్నారని లబ్ధిదారులు అంటున్నారు. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకుంది. పట్టణంలో కొందరు డీలర్లు సక్రమంగా పంపిణీ చేస్తున్నారు. మరికొందరు మాత్రం లబ్ధిదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే బయోమెట్రిక్ యంత్రం రెండు మూడు దుకాణాలకు ఒక్క అపరేటరే ఉండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క షాపులో పంపిణీ చేస్తే మరో షాపులో పంపిణీ జరగదని లబ్ధిదారులు అంటున్నారు.



ప్రభుత్వ గోడౌన్‌లో ఉన్న బియ్యం

రేషన్ తక్కువగా ఇస్తున్నారు



ఎర్రగుంట్ల పట్టణంలోని పలు చౌక దుకాణాలలో రేషన్ లబ్ధిదారులకు తక్కువగా ఇస్తున్నారు. అడిగితే మేం ఇచ్చేది ఇంతే అని అంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు కూడా తెలియజేశాం. లబ్ధిదారులకు సకాలంలో తక్కువ రాకుండా రేషన్ అందించాల్సింది. ఇప్పటికైన అధికారులు స్పందించి లబ్ధిదారులకు సరుకులు అందేలా చూడాలి

– డి.సూర్యనారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, ఎర్రగుంట్ల

తహసీల్దార్ ఏమన్నారంటే

ఈ విషయంపై తహసీల్దార్ శోభన్‌బాబును వివరణ కోరగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి నెల 90 శాతంపైగానే రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. అక్కడక్కడ కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. లబ్ధిదారులకు ఏదైన రేషన్ పంపిణీలలో ఇబ్బందులు ఉంటే నేరుగా ఫిర్యాదులు అందించ వచ్చునని అన్నారు. ఎండీయూ వాహనాలు ఇంటింటికి పంపిణీ చేస్తున్నాయని, కొన్ని చోట్ల చౌక దుకాణం వద్దనే పంపిణీ జరుగుతున్నట్లు తెలిపారు. తక్కువ ఇస్తున్నారని తెలియజేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తులకు గడువు పొడిగింపు

పులివెందుల టౌన్ : ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ల రుణాలకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకుని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తుల గడువును ఈనెల 7వ తేదీ నుంచి ఈనెల 12వ తేదీ వరకు పెంచడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

లింగాల : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ఇంకుడు గుంతలు తవ్వించాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని పీఆర్‌అండ్ ఆర్‌డీ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి, వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

వేంపల్లె మెయిన్ రోడ్ల విస్తరణలో కదలిక

సాక్షి ఎఫెక్ట్..

వేంపల్లె : వేంపల్లె ప్రధాన మెయిన్ రోడ్లు పనులు పునఃప్రారంభమయ్యాయి. పెరుగుతున్న ట్రాఫిక్ ను నియంత్రించడం తోపాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన రహదారి విస్తరణ పనులు ప్రస్తుత ప్రభుత్వం విస్తరణ పనులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ప్రభుత్వంలో పట్టణంలోని ప్రధాన రహదారులైన కడప, పులివెందుల, గండి మెయిన్ రోడ్లను 72 అడుగుల మేర విస్తరిస్తూ జనవరి 2024లో పనులు ప్రారంభించారు. కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ వద్ద నుండి 3.8 కిలోమీటర్ల మేర 72 అడుగులు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టింది. సెంటర్ లైటింగు, రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్, అండర్ డ్రైనేజీ, తదితర సుందరీకరణ పనులను చేపట్టడం జరిగింది. రోడ్డు విస్తరణలో కోల్పోయిన గృహ, వాణిజ్య సముదాయాలకు రూ.18.50 కోట్లు నష్టపరిహారం కూడా అందించారు. కేవలం రూ.60.05 కోట్లను రహదారి నిర్మాణాలకు, సెంటర్ లైటింగ్ సుందరీకరణ పనులకే కేటాయించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో కడప, పులివెందుల రోడ్లలో 27% నిర్మాణ పనులు చేపట్టారు. తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించకపోవడంతోపాటు వివిధ కారణాలవల్ల నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. సాక్షి దినపత్రికలో వరుస కథనాలు రావడంతో ఉన్నతాధికారులలో చలనం వచ్చి రోడ్డు విస్తరణ పనులు కొనసాగించారు. గత వారం రోజులుగా విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్, కాలువల నిర్మాణాలను చేపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చి ఉండి ఉంటే ఇప్పటికే రోడ్డు విస్తరణ పనులు పూర్తై ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయేవి. గండి రోడ్డు విస్తరణ పనులు కేవలం 4 శాతమే చేపట్టడంతో కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇటీవల కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పర్యటించి ఆర్‌అండ్‌బీ ఈఈ మాధవితో కలిసి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. గండి రోడ్డులో విస్తరణ పనులు ప్రజలకు ఎంతో అవసరమని తెలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వేంపల్లె మెయిన్ రోడ్డులో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు

అధైర్యపడవద్దు.. అండగా వుంటాం

ముద్దనూరు : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకుండా వుండాలని వారికి ఎల్లవేళలా అండగా వుంటామని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని వేల్పుచెర్ల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పులివెందులలో ఎంపీని కలిశారు. రెండున్నర నెలల క్రితం వేల్పుచెర్ల గ్రామంలో గొర్రెల విషయంలో జరిగిన ఘర్షణకు రాజకీయరంగుపులిమి అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు చేయించారని, ఈ కేసులో అరెస్టై జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చినట్లు బాధితులు ఎంపీకి తెలిపారు. వేల్పుచెర్ల గ్రామానికి చెందిన మణికంఠరెడ్డి, ఈశ్వరయ్య, నాగిరెడ్డి, శివసుధాకర్‌లు ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా బాధితులు ఎంపీతో మాట్లాడుతూ చిన్న ఘర్షణకు మహిళలపై కూడా హత్యాయత్నం కేసు నమోదుచేయించారని ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన మీకు కృతజ్ఞతలని వారు పేర్కొన్నారు. అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరంలేదని, తాను వైఎస్సార్‌సీపీ అందరికీ అండగా వుంటామని ఎంపీ తెలిపారు.



ఎంపీతో వేల్పుచెర్ల నాయకులు

పరిసర ప్రాంతాల్లో శుభ్రత పాటించాలి

వేంపల్లె : ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా తాళ్లపల్లె పీహెచ్‌సీ ల్యాబ్‌ను ఆయన తనిఖీ చేశారు. అలాగే మలేరియా, డెంగీ కేసులు నమోదుపై టెక్నీషియన్‌తో ఆరా తీశారు. తాళ్లపల్లెలో ఇంటింటా ఫీవర్, లార్వా సర్వేలు చేపట్టారు. సీజనల్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్త పూతలు సేకరించి వారానికి మూడుసార్లు ల్యాబ్‌కు అందజేయాలని ఆదేశించారు. మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఆశా కార్యకర్త సుజాత పాల్గొన్నారు.



అబైట్‌ను పిచికారి చేయిస్తున్న సిద్దయ్య

'స్టెమీ' సేవలను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : స్థానిక సీహెచ్‌సీలో రోగులకు అందించే 'స్టెమీ' సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, స్టెమీ నోడల్ ఆఫీసర్ తాజుద్దీన్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో రోగులు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బందికి స్టెమీ సేవలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గుండె నొప్పి వచ్చిన వారిని గంట సమయంలోపు ఆసుపత్రికి తీసుకువస్తే ఈసీజీ పరీక్షలు నిర్వహించి రూ.42 వేలు విలువ చేసే టెనెక్టప్లేస్ ఇంజక్షన్ వేస్తామన్నారు. ఈ ఇంజక్షన్ వేయడం వలన రోగి ఆరోగ్యం 48 గంటల వరకు నిలకడగా ఉంటుందని ఆయన వివరించారు. అనంతరం జిల్లా కేంద్రాలకు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు రెఫర్ చేస్తామన్నారు. రోగులు అక్కడ మీకిష్టమైన పద్ధతిలో ఆపరేషన్ చేయించుకోవచ్చన్నారు. టెనెక్టప్లేస్ ఇంజెక్షన్ ఖరీదైందన్నారు. ఈ ఇంజక్షన్ రక్త నాళాల్లో ఏర్పడిన బ్లడ్ క్లాట్స్‌ను కరిగించి ఆరోగ్యాన్ని క్షేమంగా ఉంచుతుందన్నారు. ఇప్పటి వరకు తమ ఆసుపత్రిలో 12 మందికి ఈ ఇంజెక్షన్ వేసి ప్రాణాలు కాపాడినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు, రోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్టెమీ నోడల్ ఆఫీసర్ తాజుద్దీన్

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పులివెందుల రూరల్ : ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని డీఎస్పీ మురళినాయక్ తెలిపారు. శుక్రవారం పోలీసులు హెల్మెట్ ప్రాధాన్యత వివరిస్తూ పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్ నుండి శ్రీనివాస హాలు, ఓల్డ్ గంగిరెడ్డి హాస్పిటల్, పూలంగళ్ల సర్కిల్, పాత బస్టాండ్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పూలంగళ్ల సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడంవల్లే చనిపోతున్నారన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ బీవీ ప్రసాద్, అర్బన్ సీఐ నరసింహులు, రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్‌ఐలు, వివిధ కళాశాలల విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బైకుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

రేపు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని డాక్టర్ ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి(దినేష్ మెడికల్ సెంటర్)లో ఆదివారం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలతోపాటు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని షుగర్ సమస్యలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట వేడుకలు

వేముల : వెంకటేశ్వరపురం గ్రామంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరగనున్నాయి. గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో దేవాదాయ శాఖ నిధులతో నూతనంగా రామాలయాన్ని నిర్మించారు. శనివారం నుంచి పురోహితులు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు. గ్రామ దేవత గంగమ్మ ప్రతిష్టతోపాటు నాగుల ప్రతిష్ట జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేడుకల్లో మండల ప్రజలు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

నేత్రదానం

లింగాల : నేత్రదానం చేయడంవల్ల ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చునని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తెలిపారు. శుక్రవారం తేర్నాంపల్లె గ్రామానికి చెందిన ఉండల సుబ్బారెడ్డి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. ఆయన కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపించారు.

అరటి పంట దగ్ధం

లింగాల : మండలంలోని లోపట్నూతల గ్రామంలో రెండో కోత దశలో ఉన్న అరటి పంటకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. లోపట్నూతల గ్రామానికి చెందిన పెద్దపోతుల అప్పల, పెద్దపోతుల బ్రహ్మంకు చెందిన రెండు ఎకరాల పొలంలో అరటి పంట అగ్గిపాలయ్యింది.

వేంకటరమణ.. గోవిందా

పులివెందుల టౌన్ : మము కరుణించరావా శ్రీవేంకటరమణ.. గోవిందా.. గోవిందా అంటూ భక్తులు స్వామివారిని ఆరాధించారు. పట్టణంలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం ఉదయం శ్రీవారు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు సహస్త్ర దీపాలంకరణ ఊంజల్ సేవ నిర్వహించి స్వామి వారికి పట్టు పీతాంబరాలను సమర్పించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం సతీసమేతుడైన స్వామివారు ముత్యపు పందిరి వాహనంలో పురవీధులలో జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారు ఊరేగుతుంటే భక్తులు అడుగడుగునా నీరాజనాలు అర్పించారు. శ్రీవేంకటరమణుడు రాకతో పురవీధులు పులకించాయి. భక్తుల మదిలో భక్తి పారవశ్యం పొంగి పూజాద్రవ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్త్రనామార్చన, నివేదన, నిత్య హోమం, కలశారాధన, ఇత్యాది కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు నిర్వహించారు. ఉభయదారులతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



ముత్యపు పందిరి వాహనంపై సతీసమేత శ్రీవేంకటరమణస్వామి

నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలి

వేంపల్లె : నులిపురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీఓ కుళాయమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించి అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలనకు సంబంధిత పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 17న మాఫ్ అప్ డేలో గైర్హాజరైన పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ స్వాతిసాయి మాట్లాడుతూ 1–19 ఏళ్ల వయసు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు మండల వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఇచ్చేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర షఫివున్నీషా, సీహెచ్‌ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

లింగాల : మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలతోపాటు అన్ని గ్రామాల్లోని 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లందరికి నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ద్వారా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ కళ్యాణ్ దినకర్, సీహెచ్‌ఓ శివరాంలు మాట్లాడుతూ మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు.

వీరపునాయునిపల్లె : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మండల వైద్యాధికారి మహమ్మద్‌తాహ నులిపురుగుల నివారణ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలో 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రంగనాథ్ శర్మ, పీహెచ్‌ఎన్ దనలక్ష్మి, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



వేంపల్లెలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

అనుకున్న లక్ష్యాన్ని అంకితభావంతో సాధిస్తారు

వేంపల్లె : అనుకున్న లక్ష్యాన్ని అంకితభావం, చిత్త శుద్ధితో సాధిస్తారని వక్త ఫణి వంశీనాథ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా ఆధ్వర్యంలో యూపీఎస్సీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వక్త ఫణి వంశీనాథ్ హాజరై యూపీఎస్సీ పరీక్షలకు అవగాహన కల్పించారు. ఫణి వంశీనాథ్ ప్రతిష్టాత్మకమైన బాంబే ఐఐటీలో బిటెక్ చదివి, ప్రీమియర్ సాఫ్ట్‌వేర్ సంస్థలో కోటి రూపాయల వార్షిక వేతనంతో ఉద్యోగం పొందారు. జీవితంలో మంచి స్థానం సంపాదించినప్పటికీ, ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో ఆ ఉద్యోగాన్ని విడిచిపెట్టారని, తన సొంత ప్రిపరేషన్ ద్వారా మొదటి ప్రయత్నంలోనే యూపీఎస్సీ 2014 ప్రిలిమ్స్, మెయిన్స్ పూర్తి చేశారని డైరెక్టర్ కుమారస్వామి తెలిపారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్ కైలాష్, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్ తదితరులు పాల్గొన్నారు.